


# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**APRIL - 2011**

సంవత్సర చందా రూ. 50/-

## సంక్షిప్త వార్తలు

2011 మార్చి 9వ తేదీ బుధవారం కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘ ఆవరణలో సువార్తికుల సదస్సుజరిగెను. పలు జిల్లాలనుండి,గ్రామములు పట్టణములనుండి అనేకమంది సువార్తికులు సకాలమునకు చేరుకొనిరి. అమెరికా దేశమునుండి వచ్చిన సోదరులు రిక్ జాన్సన్ గారు ముఖ్య అతిధిగా, వక్తగా ఆ సదస్సులో పాల్గొనిరి. సువార్తికులకు,స్ధానిక సంఘాలకు అవుసరమైన శక్తివంత సందేశములను ఆయన ఆరోజు అందజేసిరి.సోదరులు రిక్కీగూటం గారు ఆయనకు తర్జుమాచేసిరి. మరియు భారతీయసోదరులలో కొందరు కూడ వాక్యపరిచర్యచేసిరి. హాజరైనవారందరికీ ఆరోజు మంచి భోజనము,తేనీరు అందజేయబడెను.

2011 మార్చి 29,30,31 తేదీలలో మండపేట మండలం నిడసనమెట్ట గ్రామములో అక్కడ స్ధానికసంఘ 18వ వార్షికోత్సవ సందర్భముగా దేవుని రాజ్యసువార్త సభలు జరిగెను. " క్రైస్తవ కుటుంబము యొక్క ప్రాముఖ్యత " యను అంశముపై పలువురు సువార్తికులు వాక్యపరిచర్యచేసిరి. వి.రాజావిజయకుమార్(రాజుమండ్రి), వి.సుదర్శనరావు(రాజుమండ్రి) గార్లు మొదటిదినమున క్రైస్తవకుటుంబములో తండ్రియొక్క పాత్ర,ఫలించు క్రైస్తవ కుటుంబము అను అంశములపై మొదటి దినమున చక్కటి సందేశములనిచ్చిరి.కె.సాల్మన్‌రాజు,టి.ప్రసన్న విజయకుమార్(ద్రాక్షారామ),జాషువా గూటం గార్లు రెండవ దినమున వాక్యపరిచర్య చేయుగా,ఎన్.శాంసన్ రాజు(గూడపర్తి),యం.సూర్యరావు,మరియు కె.జి.కుమార్ గార్లు మూడవ దినమున వాక్యపరిచర్యచేసిరి.ప్రతికూటమునకు స్ధానికులు పెక్కుసంఖ్యలో హాజరైరి.సోదరులు సి.హెచ్ భాస్కర్ పౌలుగారు నిడసనమెట్ట గ్రామములో క్రీస్తుకొరకు మంచిపని చేయుచున్నారు.ఆయన స్ధానిక సంఘసభ్యులు కలసి ఈసువార్త కూటములను విజయవంతముగా నడిపించినందున అభినందనీయులు.

రిక్కీగూటంగారుఈపత్రిక ముద్రించుసరికి కుటుంబసమేతముగా అమెరికా వెళ్లు ప్రయత్నములోయున్నారు. రిక్కీగారు,వారిసతీమణిసుదీపగారు.కుమారుడు జస్టిన్‌గార్లు ఈ నెల 6వ తేదీన బయలు దేరుదురు. వారిప్రయాణ విషయమై చదువరులు ప్రార్ధించమనవి.

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 31 | ఏప్రియల్ - 2011 | సంచిక - 9


## నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము
## (Keep Thy Heart With all Diligence)

దేవుని గ్రంథమైన బైబిలు ఇట్లు చెప్పుచున్నది : నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును. కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగా నీ హృద యమును భద్రముగా కాపాడుకొనుము" (సామెతలు 4:23). మన తలంపులను బట్టి మన వ్యక్తిత్వము తయారగును. మన ప్రవర్తన సౌధము అంతయును మన తలంపుల పైనే ఆధారపడి నిర్మించబడును. మనలను గూర్చి మనం యేమి తలంచు కొనుచున్నావెూ గాక, మనవేుమి తలంచుచున్నావెూ అట్లు మనము తయారవుదుము.

మన అంతర్యతలంపులు, బాహ్య ప్రవర్తన ఎల్లప్పుడు ఏకీభవించాలి. యేసు ప్రభువు ఇట్లు చెప్పారు : "నోటి నుండి బయటికి వచ్చునవి హృదయములో నుండి వచ్చును; ఇవే మనుష్యుని అపవిత్ర పరచునని మీరు గ్రహింపకున్నారా? దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచా రములు, వేశ్యాగమనములు, దొంగత నములు, అబద్ధ సాక్ష్యములు దేవ

దూషణలు హృదయములోనుండి వచ్చును; ఇవే మనుష్యుని అపవిత్రపర చును" (మత్త 15:18-20). "లోపలి నుండి, అనగా మనుష్యుల హృదయములో నుండి దురాలోచనలును, జారత్వమును, దొంగతనములను, నరహత్యలును, వ్యభిచారములును లోభములును చెడుతనములును కృత్రిమమును, కామ వికారమును, మత్సరమును, దేవ దూష ణయు, అహంభావమును, అవివేకమును వచ్చును. ఈ చెడ్డ వన్నియు లోపలి నుండియే బయలు వెళ్లి మనుష్యుని అపవిత్రపరచును" (మార్కు 7:21-23). "సజ్జనుడు తన హృదయమను మంచి ధన నిధిలో నుండి సద్విషయములను బయటికి తెచ్చును; దుర్జనుడు చెడ్డ ధన నిధిలోనుండి దుర్విషయములను బయటికి తెచ్చును. హృదయము నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును" అని కూడ యేసు ప్రభువు చెప్పారు (లూకా 6:45).

మన హృదయ తలంపులను బట్టి బాహ్య ప్రపంచముండును. మన హృదయమను బావిలో యున్న తలంపులను బట్టియే మన సంభాషణ, ప్రవర్తన యుండును. అందువలననే యేసుప్రభువు ఇట్లు బోధించారు "నేను మీతో చెప్పునదేమనగా తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును, తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును; ద్రోహీ అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును. గావున నీవు బలిపీఠము నొద్ద అర్పణము నర్పించు చుండగా నీ మీద నీ సహోదరునికి విరోధమేమైనా కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చిన యెడల, అక్కడ బలి పీఠము యెదుటనే నీయర్పణము విడిచిపెట్టి, మొదట వెళ్ళి నీ సహోద రునితో సమాధానపడుము; అటు తరవాత వచ్చి నీయర్పణము నర్పింపుము" (మత్తయి 5:21-24).

మన తలంపులను బట్టి మన వ్యక్తిత్వము నిర్మించబడును గనుక మన అంతర్యపురుషుని యెడల మనం ప్రత్యేక శ్రద్ధ వహించాలి. క్రైస్తవుడు కాని భర్తతో కాపురము చేయుచున్న క్రైస్తవ స్త్రీలను అపొ. పేతురు ఇట్లు హెచ్చరించాడు: "అటువలె స్త్రీలారా మీరును మీ స్వపురుషులకు లోబడి యుండుడి. అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే వారు భయముతో కూడిన మీ ప్రవర్తన చూచి వాక్యము లేకుండగనే తమ భార్యల నడవడి వలన రాబట్ట బడవచ్చును. జడలు అల్లుకొనుటయు, వస్త్రములు ధరించుకొనుటయునను వెలుపటి అలంకారము మీకు అలంకారముగా ఉండక, సాధువైనట్టియు, మృదువైనట్టి

యున్నైన గుణమను అక్షయాలంకాముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను. అది దేవుని దృష్టికి మిగుల విలువ గలది" (1 పేతురు 3:1-4). బాహ్యాలంకారము కంటె అంతరంగిక అలంకారము విలువైనదని పేతురు చెప్పుచున్నాడు. అది బహుబలము గలది, గనుక బయటి ప్రపంచాన్ని గూర్చిగాక మన అంతరంగిక స్వభావమును గూర్చి, తలంపులను గూర్చి మనం యోచన కలిగి యుండాలి. మన నిత్యగమ్యం మన తలంపులపై ఆధారపడి యుంటాది.

మనం ఒక తలంపును విత్తిన యెడల ఒక క్రియను కోతుము; ఒక క్రియను విత్తిన యెడల ఒక అలవాటును కోతుము, ఒక అలవాటును విత్తిన యెడల ఒక ప్రవర్తనను కోతుము. మనం ఒక జీవితాన్ని జీవించిన యెడల అది నిత్యత్వమునకేగును. అందువలన ఆయా వ్యక్తుల యొక్కయు, జనాంగముల యొక్కయు తలంపులు వారివారి నిత్యగమ్యమును సూచించును. అందు వలన మనమేమి తలంచుచున్నామో యని జాగ్రత్త పడాలి.

మన తలంపులు, మనస్తత్వము ఎట్లున్నదో ఒకసారి గమనించుకోవాలి. దేవుని గూర్చి, ఆయన సంఘమును గూర్చి, సహోదరులను గూర్చి, నీ కుటుంబ సభ్యులను గూర్చి నీ తలంపులు ఎట్లున్నాయి?

కొందరు తమ మనస్సులో దేవునికి చోటియ్యనొల్లక చేయరాని కార్యములు చేతురు. "అట్టివారు సమస్తమైన దుర్నీతిచేతను, దుష్టత్వము చేతను, లోభముచేతను, ఈర్ష్యచేతను నిండుకొని మత్సరము, నరహత్య కలహము కపటము వైరమను వాటితో నిండుకొనిన వారై కొండె గాండ్రును, అపవాదకులును, దేవ ద్వేషులును, చెడ్డవాటిని కల్పించు వారును, తలిదండ్రుల కవిధేయులును, అవివేకులును, మాట తప్పువారును అనురాగ రహితులును, నిర్దయులునైరి. ఇట్టి కార్యములను అభ్యసించువారు మరణమునకు తగినవారు అను దేవుని న్యాయవిధిని వారు బాగుగ ఎరిగి యుండియు వాటిని చేయుచున్నారు. ఇది మాత్రమే గాక వాటిని అభ్యసించు వారితో సంతోషముగా సమ్మతించుచున్నారు" (రోమా 1:28-32).

యేసుప్రభువు తప్పిపోయిన కుమారుని గూర్చిన ఉపమానమును లూకా సువార్త 15వ అధ్యాయములో చెప్పారు. నిజానికి మనము ఆ కథనంలో తప్పిపోయిన వాడు చిన్న కుమారుడే అనుకొంటాము, నిజమే అతడు తన దుష్ట తలంపు వలన, దుర్వ్యాపారము వలన తండ్రి నుండి, ఆయన ప్రేమనుండి దూరమై

పోయాడు. అయితే పెద్ద కుమారుడు తండ్రి యింటిలోనే యుంటూ అంతకంటే ఎక్కువ తప్పిపోయాడు. తన హృదయంలో ఈర్ష్యనంతటినీ తండ్రియొద్ద వెళ్లగక్కాడు. అతడు పైకి బాగానే కన్పించినా, అతనిలో అసలైన వ్యక్తి అనాడు బయట పడ్డాడు . అతడు ఆనాటి పరిసయ్యులకు సూచనగా యున్నాడు, నీ హృదయ తలంపులు ఎట్లున్నాయి?.

అసూయ, మత్సరము వగయి రాలాంటి తలంపులను మనం పాపమని ఎంచము, గాని అది విచారం. యేసు ప్రభువు అట్లు తలంచలేదు, ఆయన ఇట్లన్నారు: "అయ్యోవేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు సున్నము కొట్టిన సమాధులను పోలియున్నారు. అవి వెలుపల శృంగారముగా అగపడును గాని లోపల చచ్చిన వారి యెముకలతోను సమస్త కల్మషముతోను నిండి యున్నవి, ఆలాగే మీరు వెలుపల మనుష్యులకు నీతిమంతులుగ అగపడుచున్నారుగాని, లోపల వేషధారణ తోను అక్రమముతోను నిండియున్నారు" (మత్త 23:27-28).

మిత్రుడా నీ హృదయాలోచనలు యెట్లున్నవి? వాటిని యేసు ప్రభువు వైపు మళ్లించు, ఆయన యందు విశ్వాస ముంచు, నీ పాపముల విషయమై మారు మనస్సు పొంది బాప్తిస్మము పొందుము, అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన ఆయన సమాధానము నీకృప నీ తలంపులకు కావలి యుండును !! (ఫిలిప్పీ 4:7).

క్రైస్తవరుజువులు :

## పురావస్తు శాస్త్రము నుండి ఋజువు-1
## (Evidence From Archaelogy- 1)

బైబిలు చారిత్రాత్మకంగా నమ్మదగినది కాదని సంవత్సరాల కొలది అనేకులు విమర్శించేవారు. చరిత్ర యొక్క రికార్డులలో బైబిలు నందలి సంఘటనలు, స్థలములు లిఖించబడియుండకపోతే బైబిలు చెప్పే కథలు కట్టు కథలేయని వారు ముగింపుకు వచ్చేస్తారు. పురావస్తు శాస్త్రముద్భవించక ముందు బైబిలు లేఖనముల యదార్థతను యితరాత్రా నిర్ధారించే అవకాశం లేకపోయింది.

ఇప్పుడు పురావస్తు శాస్త్రము మనకిచ్చుచున్న విస్తారమైన రుజువులలో

కొన్నిటిని గమనింతము. పురాతన నాగరికతను, సంస్కృతిని శాస్త్ర యుక్తముగా పఠించుటయే పురావస్తు శాస్త్రము యొక్క ముఖ్య ఉద్దేశ్యము.

**పంచకాండములను మోషే వ్రాసెనా ?**

మోషే కాలము నాటి ప్రజలకు లిపి తెలియదు గనుక, బైబిలులోని మొదటి 5 పుస్తకములను మోషే వ్రాసియుండలేదని సంశయ శీలురు చెప్పే వారు. (మోషే క్రీ।।పూ 1450-1400 లలో ఆ గ్రంధాలను వ్రాసి యుండాలి). సరిగదా ఆకాలములో మోషే ధర్మశాస్త్రమనబడే ధర్మశాస్త్రమున్నట్లు ఋజువు యేమీ లేదన్నారు. మోషే గతించిన అనేక శతాబ్ధముల తరువాత ఒక సంపాదకుల గుంపు బైబిలులోని మొదటి 5 పుస్తకములు వ్రాసియుందురని వారు ఆరోపించారు.

**కృష్ణ శిలా స్థంభము (The Black Stele) :**

1902 లో పురాతన బబులోను పట్టణములో ఒక గుట్ట దగ్గర పురావస్తు శాస్త్రజ్ఞులు త్రవ్వుచుండుగా విరిగిపోయిన స్థంభమును ఒక దానిని కనుగొనిరి. విరిగిన ముక్కలను తిరిగి అతికించగా అది 7 అడుగుల పొడవు 2 అడుగుల వ్రాసము గల చతుస్రాకార స్థంభమాయెను.

ఆ స్థంభములో పై భాగమున బబులోనును క్రీస్తు పూర్వము 1792 నుండి 1750 వరకు పాలించిన, హనురబీరాజు బొమ్మ చెక్కబడి యుండెను. అతడు షరూష్ అను సూర్యదేవుని యెదుట నిలబడి ఒక ఉంగరమును ఒక కర్రను అందుకొను చుండెను. ఆ దేశమును పాలించడానికి, చట్టమును అమలు పరచడానికి అతనికి కను గ్రహింపబడిన అధికారమును అవి సూచించెను.

ఆ నల్ల స్థంభము యొక్క అడుగు భాగమంతా వ్రాతతో 300 చట్టములతో కప్పబడియుండెను. 'హన్మురబీ యొక్క కోడ్, అను ఈ చట్టములు మోషేకు 300 సంవత్సరముల పూర్వము వ్రాయబడెను.

వీటికంటే పురాతన చట్టముల సముదాయమును కూడా పురావస్తు శాస్త్రజ్ఞులు కనుగొనిరి Lipit Ishtar Code అనే చట్టములు హన్ము రబీకోడ్‌కు 200 సం।।లు ముందు వ్రాయబడెను. అవి నిప్పూర్ త్రవ్వకాలలో బయలుపడెను. The Code of Bilalama, King of Eshnunna హన్మూరబీ కోడ్‌కు 300 సంవత్సరముల ముందు వ్రాయబడెను. అంటే ఆ చట్టములు మోషేకు 600సం।।లు ముందు వ్రాయబడెను.

**ఎల్బారాతి పలకలు (The Elba Tablets) :**

పురాతన ఎల్బా పట్టణములో బైబిలు చారిత్రాత్మకంగా యదార్ధమని

నిరూపించే గొప్ప రుజువులు ఆ పట్టణపు త్రవ్వకాలలో లభించెను. యూనివర్సిటి ఆఫ్ రోమ్‌కు చెందిన ఇటలీ పురావస్తు శాస్త్రజ్ఞుడు పావులో మాథియే (Paolo Mathiae) ఉత్తర సిరియాలో టెల్ మెర్డిక్ అను ప్రాంతములో త్రవ్వటకు మొదలిడెను. 1968 లో వారు ఎల్బారాజైన ఇబ్బిత్‌లిమ్ అను పేరు గల రాజు యొక్క విగ్రహాన్ని త్రవ్వి వెలికి తీసిరి. ఈ పురాతన పట్టణము Kings Highway కు 150 మైళ్ల దక్షిణముగా యుండెను. తదుపరి అది అబ్రాహాము నివసించిన హారాను ఆయెను.

1947 లో ఆ ఇటలీ శాస్త్రజ్ఞుడు ఎల్బారాజు యొక్క భవనమును వెలికి తీసెను దానిలో చక్కగా భద్రపరచబడి యున్న మట్టి పలకలు లభించెను. తదుపరి రెండు సంవత్సరాల్లో వారు 17,000 పలకలు వెలికితీసిరి. ఆ పలకలపై ఆనాడున్న రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక సమాచారమంతయు లిఖించబడెను. ఆ పలకలలో రాజు యొక్క ఉత్తరాలు, బడులు అచ్చుపుస్తకాలు, సుమెరియన్ - ఎల్బైట్ నిఘంటువులు, ఎల్బాకును మిగతా పట్టణాలకును. ఆ పట్టణ జనాభా 260,000 లని పట్టణంలో రెండు లక్షల పశువుల, గొర్రెలు, మేకలు వుండెనని ఆ పలకలలో బయలు పరచబడెను.

ఎల్బామట్టి పలకలపై ఆయా నేరములకు విధించబడవలసిన జరిమానా లేక శిక్షలను గూర్చి , వాటిని అమలు చేసే న్యాయవిధానమును గూర్చి వ్రాయబడి యుండెను. నేరము జరిగిన సందర్భాను సారముగా శిక్ష విధించబడెను. ఉదాహరణకు ఒక యువతిని ఆమె యొక్క ఆమోదము లేకుండా లైంగికంగా ఎవడైనా కూడితే, అట్టి వానికి మరణశిక్ష విధించబడవలెను. అట్లు కాకపోతే అతనికి జరిమానా. విధించబడవలెను. ఈ శాసననము చాలమట్టుకు ద్వితీయో 22:22-30 లో యున్న శాననమునకు సన్నిహితముగా యున్నది.

ఈ శాసనములు క్రీస్తు పూర్వము 2400 సం॥లో తయారు చేయబడెను. అవి అతిపురాతన శాసనములు. అవి మోషే ధర్మశాస్త్రమునకు వెయ్యి సంవత్సరముల ముందునుండే యుండెను. గనుక ఇవ్విధముగా మోషే కాలమునాడే వ్రాయడం, శాసనములుండడం యదార్ధమని పురావస్తు శాస్త్రము నిరూపించుచున్నది.

ఎల్బా మట్టి పలకలలో 260 మంది పేర్లు చెక్కబడియున్నాయి. వాటిలో కనానీయుల పట్టణములగు ఎష్టోదు, బిబ్లాసు, దమస్కు, లాకీషు, మెగిద్దో, సీదోను అను పట్టణముల పేర్లు కూడా వున్నాయి. ఆదికాండము 14:2లో

చెప్పబడిన వరుసలోనే పల్లప్రాంత పట్టణములగు సొదొమ, గొమొర్రా, అద్మా, సెబోయీ సోయరు పట్టణములను గూర్చి కూడ ఆ పలకలు చెప్పుచున్నవి. బైబిలులో గాక ఇంకొక చోట ఈ పట్టణములను గూర్చి చెప్పబడుట ఇదియే ప్రథమము. ఎల్బా పలుకలు కనుగొనబడక ముందు సందేహశీలురు ఈ అయిదు పట్టణములు ఎక్కడ లేవనే వారు. అయితే పురావస్తు శాస్త్రజ్ఞులు సత్యాన్ని వెలికి తీసి బైబిలు యదార్థమని నిరూపించారు.

**నూజీరాతి పలుకలు :**

ఆదికాండము 14:6 మరియు ద్వితీ 2:12లో చెప్పబడిన హెూరీయులు ఎన్నడు జీవించయుండలేదని బైబిలు శత్రువులు ఆరోపించేవారు. అయితే ఇరాక్ దేశములో కిర్‌కుక్ ప్రాంతములో ఒక గట్టు దగ్గర త్రవ్వకాలలో 500 శిలాఫల కములు దొరికెను. ఈ పలకల మీద వ్రాయబడినది చదువగా హెూరీయు లుండిరని, వారు గొప్ప యుద్ధశూరులని, మధ్య ఆసియాలో వారి పాత్ర గొప్పదని అవి బయలుపరచెను.

ఆదికాండములో చెప్పబడిన అనేక ఆచారములను గూర్చి ఈ నూజీ రాతి పలకలు బయలుపర్చుచున్నాయి.

1. గొడ్రాలయిన భార్య తన దాసీని తన భర్త కిచ్చి ఆమె ద్వారా వారసుని పొందవచ్చును. శారాయి హాగరును (దాసీని) తన భర్తయైన అబ్రాహాముకు యిచ్చినది (ఆదికా 16:1-4).

2. తదుపరి ఆ దంపతులకు సహజముగా సంతానము కలిగితే, మొదటి (దాసీకి కలిగిన) వాని వారసత్వపు హక్కులు నిష్ప్రయోజనము గావించబడును. గాని మొదటి వారసుని మాత్రము వెళ్లగొట్టకూడదు. అందువలననే "దాసీని దాని కుమారుని వెళ్లగొట్టుము" అని శారా అబ్రహాముతో అనగా అందు విషయమై అతడు ఎందుకు ఆందోళన జెందెనో మనకిప్పుడు తెలియనగును.

3. అబ్రాహాము తన దాసుని హారానుకు పంపి తన కుమారుడైన ఇస్సాకుకు భార్యను కనుగొనుమని చెప్పెను (ఆది.కా.24). యిది సహజమే ఏలయనగా తండ్రి తన కుమారునికి భార్యను వెదకి యిచ్చేవాడు.

4. పెండ్లి కుమార్తెకు, ఆమె కుటుంబానికి పెండ్లి కుమారుని తండ్రి కట్నము యిచ్చేవాడు. రిబ్కాకును, ఆమె కుటుంబమునకును అబ్రాహాము 10 ఒంటెలు మీద బహుమతులను కట్నముగా, పంపించాడు (ఆదికా. 24).

5. తండ్రి తన నోటి ద్వారా ప్రకటించిన వీలునామాను మార్చుటకు వీలుకాదు. ఇస్సాకు యాకోబు కిచ్చిన ఆశీర్వాదములను మార్చలేక పోయాడు (ఆదికా. 24).

**6.** కట్నమునకు బదులు వరుడు వధువు కొరకు పనిచేయవచ్చును. రాహేలు లేయాల కొరకు యాకోబు లాబానుకు అందువలననే పనిచేసాడు (ఆదికా. 29:9-27).

**7.** వివాహ సందర్భములో తండ్రి తన కుమార్తెకు ఒక దాసీని బహూకరించవచ్చును. లాబాను జిల్పా అను దాసీని లేయాకును, బిల్హా అను దాసీని రాహేలుకును యిచ్చాడు (ఆది.కా. 29:22-20).

**8.** గృహ దేవతలను (విగ్రహములను) దొంగిలించుట చాల తీవ్రమైన నేరము. ఏలయనగా ఆ దేవతల విగ్రహములను కలిగియున్న వానికి ఆస్థి సంబంధమైన అన్ని హక్కులు చెందును. అందువలననే రాహేలు తన గృహ దేవత యొక్క బొమ్మను దొంగిలించినప్పుడు లాబాను దాని నిమిత్తమై యాకోబును తరిమెను (ఆదికా. 31).

నూజీ పలకల మీద రికార్డు చేయబడిన ఆనాటికాల ఆచారములు చట్టములు, ఆదికాండములో రికార్డు చేయబడిన సంఘటనలు యదార్ధములని మనకు నిరూపించుచున్నవి. బైబిలు నమ్మతగినది.

**హిత్తీయులు (The Hittites )**

బైబిలులో 60 మార్లుకు పైగా చెప్పబడిన హిత్తీయులను గూర్చి చరిత్రకారులు ఎక్కడ కనుగొనలేక పోయారు. హిత్తీయులెవరు లేరని, బైబిలు ఒక పురాణమేయని చరిత్ర కారులు ముగింపునకు వచ్చేసారు.

అయితే 1906 లో హ్యూగో వింక్లర్ అను పురావస్తు శాస్త్రజ్ఞుడు హిత్తీయుల ముఖ్యపట్టణమైన బోగాస్కోయ్‌ను కనుగొన్నాడు. అతడు అనేక చారిత్రాత్మక సంఘటనలతో చెక్కబడియున్న పలకలను కనుగొన్నాడు. వాటిలో హిత్తీయులకును ఐగుప్తు దేశస్థులకును మధ్య జరిగిన సైనిక ఒప్పందము ఒకటి! అంటే, హిత్తీయుల సామ్రాజ్యముండుటయేగాక, వారు ఐగుప్తీయులను, అష్షూరు దేశస్థులను సవాలు చేసేటంత శక్తిమంతులుగా యుండిరి. టర్కీదేశములో అంకార అను ముఖ్య పట్టణములోయున్న మ్యూజియంలో హిత్తీయులు ఐగుప్తు, అష్షూరు దేశస్థులతో చేసిన యుద్ధములను గూర్చిన రాతిపలకలను నేడు మీరు కూడ దర్శించవచ్చును.

**షీషకు చెక్కడము (Shishak Relief):**

ఐగుప్తును పాలించిన ఫరోలలో షీషకు యొక్క పేరు బైబిలులో మొదట చెప్పబడెను. ఫరోయైన షీషకు క్రీ॥పూ॥ 945 నుండి 924 వరకు ఐగుప్తును పాలించెను. క్రీ॥పూ॥ 925 లో అతడు ఇశ్రాయేలును, యూదా దేశమును దండెత్తెను మరియు సొలోమోను నిర్మించిన దేవాలయము నుండియు,

రాజమందిరము నుండియు, విలువైన సామాగ్రిని దోచుకొని పోయెను.

షీషకు యొక్క దండయాత్రను గూర్చి బైబిలు క్లుప్తముగా వర్ణించు చున్నది. "రాజైన రెహబాము యొక్క అయిదవ సంవత్సరము నందు ఐగుప్తు రాజైన షీషకు వెయ్యిన్ని రెండవందల రథములతోను ఆరువేల గుఱ్ఱపు రౌతులతోను యెరూషలేము మీదికి వచ్చెను" (2 దినవృ 12:2).

"ఐగుప్తు రాజైన షీషకు యెరూషలేము మీదికి వచ్చి యెహోవా మందిరపు బొక్కసములన్నిటిని రాజన గరులోని బొక్కసములన్నిటిని దోచుకొని సొలోమోను చేయించిన బంగారపు డాళ్లను తీసికొనిపోయెను" (2 దినవృ 12:9).

లక్సోర్ మహాపట్టణములో కర్నాక్ మందిరము దగ్గరనున్న షీషకు చెక్కడము ఇంకా ఎక్కువైన వివరములను మనకిచ్చుచున్నది. అతడు దండెత్తి మరి కొన్ని పట్టణములను ఆరాదు. బేత్‌హెూరాను, బేత్‌షియాను, గిబియోను, మహనయీము, మెగిద్దో, రీహోబు మరియు తానాఖ్ మొ॥గు వాటిని గూర్చి ఆ చెక్కడ ములు వివరించుచున్నవి. ఆ చెక్కడాలు కాలాన్ని బట్టి క్షీణించిపోయి నను, బైబిలు యొక్క యదార్థతను అవి మనకు తెలియ జేయుచున్నవి.

**దావీదు యొక్క గృహము :**

యువకుడైన దావీదు వడిసెల గులకరాళ్ళతో ఫిలిష్తీయుల శూరుడగు గొలి యాతును సంహరించినట్లు బైబిలు చెప్పు చున్నది (1 సమూయేలు 17). అతడు సౌలు యొక్క దండుల ముఖ్యడై రాజైన సౌలు యొక్క కుమార్తెను వివాహమాడెను (1సమూ18). తదుపరి అతడు ఇశ్రాయేలు రాజుగా అభిషేకించబడెను. వ్యభిచారము, నరహత్య, మారుమనస్సు, విశ్వాసములతో అతని జీవిత కథయున్నది. అది ఎంత ఆశ్చర్యకరమైనదంటే, సందేహ శీలురు అదంతా అభూత కల్పనయని కొట్టి పారేసారు.

1994లో ఇశ్రాయేలు దేశస్థులైన కొందరు పురావస్తు శాస్త్రజ్ఞులు ఇశ్రాయేలులో ఉత్తరముననున్న దాను పట్టణము దగ్గర త్రవ్వుచుండగా వారొక రాతి స్థంభము ను కనుగొనిరి. దాని పై యున్న వ్రాతలు అరామిక్ భాషయై యుండెను. ఆ శిలా ఫలకములపై "ఇశ్రాయేలు రాజు" "దావీదు గృహము" అను మాటలు చెక్కబడియుండెను.

యిది కనుగొనబడగానే సందేహ శీలురు అట్టిది కనుగొనబడడం అబద్ధమని, దానిపై చెక్కబడిన వ్రాతలను సరిగా తర్జుమా చేయలేదని వారు చెప్పారు. అయితే మరుసటి సంవత్సరములో అట్టివి ఇంకా కొన్ని లిఖిత పూర్వక చెక్కడములు కనుగొనబడెను. వాటిలో రాజును గూర్చి

ఇంకా ఎక్కువ అదనపు సమాచారము ఇయ్యబడెను.

ఆ రాతి స్థంభమును దమస్కురాజు దాను పట్టణమును క్రీ॥పూ॥ 825 లోపట్టు కొనిన తరువాత నిలువబెట్టి, ఆయా సంగతులు దానిపై చెక్కించెను. యిది దావీదు పాలించిన ఇంచుమించు 200 సంవత్సరముల తరువాత జరిగెను. ఆనాడున్న ఇశ్రాయేలు రాజు బహుశా యెహోరాము, దావీదు గృహమనగా యూదా రాజైన అహజ్యా అయ్యుండ వచ్చును. బైబిలుకు బదులుగా వేరొక చోట దావీదు రాజును గూర్చి చెప్పుచు న్నందున యిది ప్రాముఖ్య పరిశోధనయే, వీటన్నిటి బట్టి దావీదు నిజమైన వ్యక్తియే యని పండితులందరు ఏకీభవించు చున్నారు.

## దేవుడు దయ, కృపగలవాడు
## (God is merciful and Gracious)

పరమందొక దేవుడున్నారు ! ఆయన ఎట్లుంటారు ? దేవుని యొక్క దయాళుత్వము వలన శిక్షకు పాత్రులైన వారి యెడల సయితము ఆయన కృప చూపువాడని గత పాఠంలోమనము నేర్చుకొని యున్నాము.

దేవుడు క్షమించుటకు సిద్ధముగా యున్నారు.

మానవులందరు బలహీనతల తోను, పొరబాట్లతోను, పాపముల తోను నిండి యున్నారు. ఈ లక్షణాలు కొందరి జీవితాల్లో మరీ ఎక్కువగుటచే వారు నిరాశతో నిండి యుందురు. అయితే దేవుని యందు నమ్మికయుంచువారికి నిరీక్షణయున్నది. ఈలోకంలో యున్న సాధక బాధకాలనుండి, బలహీనతల నుండి విడుదల కాదుగాని, దేవుని నుండి వారికి కృప దయ, క్షమాపణ లభించు చున్నది.

మనం కొంత పఠించితే ఈ మాటల యొక్క భావాన్ని పూర్తిగా గ్రహించుకొని, దేవునిని కూడ తెలిసికొన గలము. దేవుడు క్షమించుటకు సిద్ధమైన మనస్సును, దయావాత్సల్యతలు గల వాడును, దీర్ఘశాంతమును బహుకృప యుగలవాడని నెహెమ్యా 9:17 చెప్పుచు న్నది. "యెహోవా కనికరము, దయ, దీర్ఘశాంతము, విస్తారమైన కృపాసత్య ములు గలదేవుడని" నిర్గమ 34:6లో చెప్పబడినది.

**ప్రేమనుబట్టి దేవుడు మనలను ఏర్పరచు కొన్నారు :**

అర్హులము కాకపోయినను దేవుడు మన యెడల చూపు దయ ఆయన కృప అయ్యున్నది. ద్వితీ 7:7–8 యిట్లు చెప్పుచున్నది: "మీరు సర్వజనముల కంటె విస్తారజనమని యెహోవా మిమ్మును ఏర్పరచుకొనలేదు, సమస్తజనములకంటె మీరు లెక్కకు తక్కువే గదా. అయితే యెహోవా మిమ్మును ప్రేమించువాడు గనుక.... మిమ్మును ఫరో చేతిలోనుండి విడిపించెను", "ఎందుకనగా మునుపు అవివేకులమును, అవిధేయులమును మోసపోయిన వారమును నానా విధములైన దురాశలకును భోగములకును దాసులమై యుండి దుష్టత్వము నందును అసూయయందును కాలము గడుపుచు, అసహ్యులమై యొకనినొకడు ద్వేషించుచు ఉంటిమిగాని, మన రక్షకుడైన దేవుని యొక్కదయయు, మానవులయెడల ఆయన కున్న ప్రేమయు ప్రత్యక్షమైనప్పుడు మనము నీతిననుసరించి చేసిన క్రియల మూలముగాకాక, తన విశేషకనికరము చొప్పున ........ మనలను రక్షించెను" (తీతు 3:3–5).

జెకర్యా 3:3–4 ఇట్లు చెప్పుచున్నది " యెహోషువా, మలిన వస్త్రములు ధరించిన వాడై దూత సముఖములో నిలువబడి యుండగా దూత దగ్గర నిలిచి యున్నవారిని పిలిచి –ఇతని మైలబట్టలు తీసి వేయుడని అజ్ఞాపించి – నేను నీ దోషమును పరిహరించి ప్రశస్తమైన వస్త్రములతో నిన్ను అలంకరించుచున్నానని సెలవిచ్చెను".

**క్షమించుట దైవలక్షణము :**

దేవుడు మానవుని క్షమించుటకు సిద్ధమైన మనస్సుకలిగి వానియెడల కృపాకనికరములు చూపుచు యున్నందున దేవుని తత్వాన్ని మనం అర్థం చేసికొన గలము. మానవుడు శిక్షార్హుడైనను దేవుడు కనికరముచూపుచున్నారు. "పొరబడుట మానవ లక్షణము, క్షమించుట దైవల క్షణమని" ఒకాయన చెప్పారు. యిది నిజమే. మనందరం అనుదినం అనేక పొరబాట్లు చేస్తు యుంటాము. దీనిని అందరం ఎరుగుదుము. మనం చేయ వలసినది చేయం, సరిగదా చేయకూడనిది చేస్తాం. యితరులు మన పొరబాట్లను, తప్పిదములను ఓర్చుకోవాలని కాంక్షిం స్తాము గాని తరుచు యితరుల తప్పిదము లను క్షమించుటకు ఇష్టపడము, ఏలయ నగా వారి తప్పిదములు మనకు పదే పదే జ్ఞాపకమునకు వస్తాయి, మరచిపోయే లక్షణం కోల్పోయిన వారి వలె యుం టాము.

**తరుచుక్షమించుటకు ఇష్టపడము :**

కొన్నిసార్లు మనం క్షమించుటకు,

మరచిపోవుటకు ఇష్టపడని వారివలె కనబడ్తాము. ఎదుటివాడు మన యెడల చేసిన తప్పిదమును అతని నెత్తిపై పదేపదే రుద్దుటకు ప్రయత్నం చేస్తాం. మనలో చాలమంది ఇతరులపై పగబట్టిన వారున్నారు. వారిపై బూనిన పగను బట్టి అంతరంగంలో సంతోషిస్తాము. "నీవు చేసిన తప్పిదములు నేనెరుగుదును, సమయం వచ్చినప్పుడు వాటిని బయట పెడ్తానని" లోలోపల సంతోషిస్తాము. అట్టి తలంపుల వలన మన స్వంత తప్పిదములను గూర్చి కొంత ఆదరణ మనకు లభించుచున్నట్లగు పడ్తాది. ఎదుటివాని అపరాధములను వానికి ముఖాముఖిగా చెప్పుటకు ఇష్టపడము, వానిని మార్చుటానికి ప్రయత్నం చేయము లేదా క్షమాపణను కోరము. వానిని మన హృదయంలో శపిస్తూ కూర్చుంటాము, తద్వారా సంతృప్తి జెందుతాము. అట్టి స్వభావము వలన మనం కేవలం మానవ మాత్రులమే యని రుజువగుచున్నది. మరియు దేవుని కరుణా కటాక్షములు , దయాదాక్షిణ్యములు మనలను సృష్టించలేదని అర్ధమగుచున్నది.

**దేవుడు కఠినుడుగా కనబడును :**

దేవుడు కూడ కఠినుడుగాను జాలిలేనివాడుగాను అగుపడును. ఆయన నిషేధించిన ఫలమును తిననందున ఆదాము హవ్వలను ఆయన ఏదెను వనమునుండి త్రోలివేసెను. మోషే ఒక్కతప్పు చేసినంత మాత్రాన అతనికి కానానులో ప్రవేశము నీయలేదు (సంఖ్యా 20:7-12). నిబంధన మందసమును ముట్టుకొనినందున ఉజ్జాచంపబడెను(2 సమూ 6:5-7). " ఎవడైనను మోషే ధర్మశాస్త్రమును నిరాకరించిన యెడల ఇద్దరు ముగ్గురు సాక్షుల మాటమీద కనికరింపకుండవాని చంపించుదురు " అని చెప్పుచు "ఇట్లుండగా దేవుని కుమారుని పాదములతో త్రొక్కి తాను పరిశుద్ధపరచబడుటకు సాధకమైన నిబంధన రక్తమును అపవిత్రమైనదిగా ఎంచి కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించినవాడు ఎంత ఎక్కువైన దండనకు పాత్రుడుగా ఎంచబడునని మీకుతోచును?" అని హెబ్రీ 10:28-29లో వ్రాయబడియున్నది. మనము పాపము చేసిన యెడల న్యాయపు తీర్పునకు భయముతో ఎదురు చూచుటయు విరోధులను దహింపబోవు తీక్షణమైన అగ్నియు ఇక ఉండునని పౌలు చెప్పుచున్నాడు (హెబ్రీ 10:27).

**కృపక్షమాపణలు సమృద్ధిగా యున్నవి :**

ఈ హెచ్చరికలు పాపికిని, మారుమనస్సు పొందని వాని యెదుటను ఉంచబడియున్నవి. దేవుడు పాపమును

సహించడు గనుక అట్టి హెచ్చరికలు, శిక్షలు దేవుని తత్వములో భాగమై యున్నవి. గాని పాపములనుండి వైదొలగి క్షమాపణను కోరువారికి సమృద్ధియైన క్షమాపణలభించును. "నీ దేవుడనైన యెహోవానగు నేను............ నన్ను ప్రేమించి నా ఆజ్ఞలు గైకొను వారిని వెయ్యితరముల వరకు కరుణించు వాడనై యున్నానని" ఆయన చెప్పారు (నిర్గమ 20:5-6). "కాబట్టి నీదేవుడైన యెహోవా తానే దేవుడనియు, తన్ను ప్రేమించి తన ఆజ్ఞలననుసరించినడుచు కొను వారికి తన నిబంధన స్థిరపరచు వాడును వేయి తరముల వరకు కృప చూపువాడును నమ్మతగిన దేవుడ ననియు, తన్ను ద్వేషించువారిలో ప్రతివానిని బహిరంగముగా నశింపజేయుటకు వానికి దండన విధించువాడననియు నీవు తెలిసికొనవలెనని" ద్వితీ 7:9 చెప్పుచున్నది.

"యెహోవా, ఇశ్రాయేలీయుల దేవా, పైనున్న ఆకాశమందైనను క్రిందినున్న భూమియందైనను నీవంటి దేవుడొకడును లేడు, పూర్ణమనస్సుతో నీ దృష్టికి అనుకూలముగా నడుచునీ దాసుల విషయమై నీవు నిబంధనను నెరవేర్చు కనికరము చూపుచు ఉండు వాడవై యున్నావు" (1 రాజులు 8:23).

"నాపేరు పెట్టబడిన నా ప్రజలు తమ్మును తాము తగ్గించుకొని ప్రార్ధన చేసి నన్ను వెదకి తమ చెడు మార్గములను విడచిన యెడల ఆకాశము నుండి నేను వారి ప్రార్ధనలు విని, వారిపాపమును క్షమించి వారి దేశమును స్వస్థపరచుదును" (2 దినవృ 7:14). "దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును" అని యాకోబు 4:6 చెప్పుచున్నది. "దేవా విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు". "విరిగిన మనస్సే దేవుని కిష్టమైన బలులు" (కీర్త 51:17).

**ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము.**

పగబూనుటకు, క్షమించకుండుటకు అలవాటు పడిన మనము దేవుడు నిజంగా క్షమిస్తారని గ్రహించుకోలేము. "నేను చాల పాపములు చేసాను. దేవుడు నన్ను క్షమించరు" అని చాలమంది తలస్తారు. ఇతరులను క్షమించడం మనకు చేతకాదు గనుక దేవుని గూర్చి కూడ అట్లే తలస్తాము. అయితే మన పరిస్థితిని బట్టి దేవుని గూర్చి అంచనావేయరాదు, "మీపాపములు రక్తము వలె ఎర్రనివైనను అవిహిమమువలె తెల్లబడును, కెంపువలె ఎర్రనివైనను అవిగొర్రె బొచ్చువలె తెల్లనివగునని" యెహోవాపెలవిచ్చుచున్నారు (యెషయా 1:18). "పడమటికి తూర్పుఎంత దూరమో ఆయన మన అతిక్రమములను అంత దూరపరచియున్నాడు" (కీర్తన 103:12). "నా

యొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రము ను బయటికి త్రోసివేయను" అని ఆయన చెప్పుచున్నారు (యోహాను 6:37).

"మన ప్రధాన యాజకుడు మన బలహీనతల యందు మనతో సహాను భవము లేని వాడు కాడుగాని సమస్త విషయములలోను మనవలే శోధింప బడినను ఆయనపాపము లేనివాడుగా ఉండెను. గనుకమనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృపపొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:15-16). దేవుడువారి అపరాధములను వారి మీద మోపక క్రీస్తునందు లోకమును తనతో సమాధానపరచుకొనుచు, "ప్రయాస పడిభారము మోసికొను చున్నసమస్త జనులారా నాయొద్దకు రండి; నేనుమీకు విశ్రాంతి కలుగ జేతును, నేను సాత్వి కుడను, దీనమనస్సు గలవాడను గనుక మీ మీద నాకాడి ఎత్తికొనినాయొద్ద నేర్చుకొనుడి, అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతిదొరుకును, ఏలయనగా నాకాడి సుళువుగాను, నాభారము తేలికగాను ఉన్నవి"యని చెప్పుచున్నారు (మత్తయి 11:28-30).

క్షమించుటకు సిద్ధముగా యున్న దేవునికి స్తోత్రములు! .

## హితబోధను సహింపనివారు

### (Turning their Ears away from the truth)

"జనులు హితబోధను సహింపక దురద చెవులుగలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసికొని సత్యమునకు చెవిఇయ్యక కల్పనాకథలవైపునకు తిరుగు కాలము వచ్చును" అని పరిశుద్ధాత్ముడు అపొ.పౌలు ద్వారా హెచ్చరించారు (2 తిమో 4:3-4).

యివి యువక బోధకుడైన తిమోతికి పౌలు యిచ్చిన హెచ్చరికలు. గమనించుము.

1. మనుష్యులు హిత (ఆరోగ్యకరమైన) బోధను సహింపరు.

2. తమ స్వకీయ దురాశలకు అను కూలమైన బోధకులను ఏర్పాటు చేసి కొందురు.

3. వారు సత్యమునకు చెవియియ్యరు.

4. కల్పనాకథలవైపు తిరుగుదురు.

దీనిపరిష్కారము: "వాక్యమును ప్రకటింపుము; సంపూర్ణమైన దీర్ఘశాం

తముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము బుద్ధి చెప్పుము" (2 తిమో 4:2). యిది చేదైన ఔషధమా? సహోదరా, యిది జీవన్మరణముల సమస్య. నిత్యజీవము లేక నిత్యనరకముల సమస్య. అందువలననే సువార్తను ప్రకటించుము, వాక్యమును ప్రకటింపుము. ఏవాక్యము? దేవుని వాక్యము! ఏలయనగా "దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" (హెబ్రీ 4:12).

అన్ని సమయములందును దేవుని వర్తమానము ప్రకటింపుము బోధించువాడు ఖండించాలి, సరిదిద్దాలి. పాపములో జీవించుచున్నవారిని అతడు ఖండించాలి, బుద్ధి చెప్పాలి. అతని బోధలో హెచ్చరించాలి. పాపులు తమ జీవన విధానములోని పాపమును కనుగొనాలి, అందరు మంచి జీవితం జీవించుటకు ప్రోత్సహించబడాలి. ఓర్పుతో, సహనముతో బోధించాలి . మనము విత్తనము విత్తి, నీరుపోస్తే దేవుడే దానినభివృద్ధి చేయును. ఆవిత్తనమే దేవుని వాక్యము.

సత్యమునే పలుకుటకు మన ప్రయత్నాలు రెట్టింపు చేయాలి. మన గృహాల్లో అను దినము దేవుని వాక్యము బోధింపబడునట్లు చూడాలి. మన బైబిలు తరగతులు సత్యవాక్యముతో నిండియుండాలి. వేదిక నుండి వెలవడే ప్రసంగాలు సత్యవాక్యమునకు అనుగుణంగా యుండాలి. యోగ్యమైన మంచి మనసులో పడిన విత్తనము బహుగా ఫలించును.

## అననీయ ఒక భక్తిపరుడు
## (Ananias : A Devout Man)

అననీయ, "ధర్మశాస్త్రము చొప్పున భక్తిపరుడు". దమస్కులోనున్న యూదులందరిచేత మంచి పేరుపొందినవాడు"(అపొ॥కా 22:12). ఆతనికి ప్రభువు 'దర్శనమందు' కనబడి తార్సువాడైన సౌలు అను వాని కొరకు విచారించుము ఇదిగో అతడు ప్రార్థన చేయుచున్నాడు" (అపొ॥కా 9:11) అని చెప్పబడెనని

ఎరుగుదుము. సౌలు "అననీయ అను నొక మనుష్యుడు లోపలికి వచ్చి తాను దృష్టి పొందునట్లు తలమీద చేతులుంచి యున్నాడని చెప్పెను" (12వ వచనం).

అననీయ అద్భుతశక్తిగల వాడనీ, దేవుడు దానిని అతనికిచ్చాడనిగాని, దర్శనము ద్వారా నేరుగాగాని లేదా అపొస్తులులు చేతులుంచడం వల్ల పరోక్షంగాగాని అననీయ అద్భుత శక్తిగల వాడనేది ప్రశ్నకాదు.

అపో.కా. 8:12-17 ద్వారా అపొస్తలులు మాత్రమే ఆత్మీయవరాలను ఇతరులకు అందించగలరు, ఈ సందర్భంలో ఫిలిప్పు పరిశుద్ధాత్మతోను జ్ఞానముతో నిండుకొని అపొస్తులులు చేతులుంచగా సమరయులమధ్య బలమైన అద్భుతాలు జరిగించి వెనువెంటనే జరుగుచు వచ్చిన సూచనక్రియల వలన వాక్యము స్థిరపరచబడెను (మార్కు 16:17-20). ఫిలిప్పుకూడా ఈ వరాలు ఇతరులకు ఈయులేక పోయాడు. అదేవిధంగా పేతురు, యోహానులు, సమరయులపై "చేతులుంచగా వారు పరిశుద్ధాత్మను పొందారు". పరిశుద్ధాత్మను పొందవలెనని ప్రార్థించినపుడు పొందారు. (అపో.కా. 8:15-17).

అపొస్తులులు చేతులు ఉంచినా ఫిలిప్పు తన వరాలు ఇతరులకు ఈయలేకపోతే అననీయ కూడా సౌలుకు తన అద్భుతవరం ఈయలేదు. వాస్తవానికి అపొస్తలులు తప్ప మరెవరును చేతులుంచడం అద్భుతాలు జరిగే వరం కొరకు ఏర్పరచబడలేదు. క్రొత్త నిబంధన సంపూర్ణం కావడానికి ముందు కాలంలో ఆదిమ సంఘము యొక్క క్షేమాభివృద్ధి కోసం ఈ వరాలు ప్రభువు వలన ఈయబడినవి. (1కొరింధి 13:8-10, ఎఫెసి 4:7-16). సంఘము బాల్యదశలో ఉంది. అందువలన "పూర్ణమైనది వచ్చువరకు" ఆత్మీయవరాలు అవుసరం. అదిక్రొత్తనిబంధన సంపూర్ణ బయలు పాటు. బయలుపాటు 'అసంపూర్ణమైన పుడు' వరాలు అవసరం.

పౌలు తన దృష్టిని పొందు లాగున ప్రభువు తన కాజ్ఞాపించినరీతిగా అననీయ తన చేతులను సౌలుపైనుంచాడు (9:18). అననీయ అతనికి "లేచి ఆయన నామమును బట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీపాపములను కడిగివేసికొను మని "చెప్పెను (22:16).

గాని అపో.కా. 9:17 కూడా "పరిశుద్ధాత్మతో నింపబడు" అని చెప్పుట లేదో అవునుగాని మరొకసారి పరిశీలించు. పరిశుద్ధాత్మతో బాప్తిస్మమి చ్చుట ప్రభువు మాత్రమే చేయగలరు. గనుక అననీయ అతనికి పరిశుద్ధాత్మ బాప్తిస్మము

ఇయ్యలేదు. ఆతని చేతులు సౌలుపై నుంచి అద్భుతవరమైన పరిశుద్ధాత్మను ఈయలేక పోయెను. ఇక్కడ రెండేరెండు సాధ్యాలు న్నాయి.

1. ఈ ఆత్మ బాప్తిస్మము సౌలు ప్రభువునుండి పొందాలి లేదా .

2. మరొక అపొస్తలుని ద్వారా ఈ అద్భుతవరము పొందాలి.

పౌలు పరిశుద్ధాత్మ బాప్తిస్మము ప్రభువు నుండే పొందాడనిమనతలంపు, గాని దమస్కు మార్గములో ప్రభువు ప్రత్యక్షమైనపుడుకాదు. అపుడు ఆతనికి ఈలాగు చెప్పబడింది: నీవు నన్ను చూచియున్న సంగతిని గూర్చియు నేనునీకు కనబడబోవు సంగతిని గూర్చియు నిన్ను పరిచారకునిగాను, సాక్షినిగాను నియమించుటకై కనబడియున్నాను. (అపొ.కా. 26:16).

భవిష్యత్‌లోకూడా ప్రభువు పౌలు నకు ఏదో ఒక విధంగా కనబడుదునని వాగ్దానము చేసినది గమనించు. పౌలు యొక్క పనులు, తరువాత ఆతని మాటలు ద్వారా పౌలు ఆత్మ వరాలనీయగల శక్తి పౌలుకు ఉన్నది గనుక.

(2 తిమోతి 1:6; అపొకా. 19:1-6; గలతీ 3:2). పౌలు దమస్కులో ఆతని మార్పు తరువాత. ఆరేబియాకు వెళ్ళి దమస్కు తిరిగివచ్చెను. 3 సం॥లు తరువాత పేతురును, ప్రభువు సోదరుడైన యాకోబును దర్శించుటకు యెరూషలేము వరకు వెళ్లాడు (గలతీ 1:16-19). ఆ అధ్యాయంలో తన ప్రత్యక్షతను మనుష్యులనుండికాక యేసుక్రీస్తు బయలు పరచుట వలన కలిగినది అని చెప్పెను (గలతి 1:11). ఆతని మార్పుకు యెరూషలేమువరకు వెళ్లు సమయమునకు మధ్యకాలంలో ఆయన వాగ్దానమును బట్టి ప్రభువు యొక్క ప్రత్యక్షతను పొంది పరిశుద్ధాత్మతో బాప్తిస్మము పొందాడు లేదా పరిశుద్ధాత్మతో నింపబడ్డాడు. (అపొ.కా. 9:17; 26:16; 2 కొరింథి 12:12).

ఈ అద్భుత శక్తులు క్రొత్త నిబంధన బయలుపరచబడుచున్నమేరకు పరిమితం చేయబడ్డాయి, దాని సంపూర్తి తరువాత అవి తీసి వేయబడ్డాయి. ప్రవచనాలు, భాషలు, అద్భుతాలను గూర్చిన జ్ఞానం, వాస్తవానికి అన్ని సూచనలు ఆశ్చర్యకార్యాలు 'స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియము' పూర్తయినందువల్ల తీసివేయబడ్డాయి. (యాకోబు 1:25, 2:12).

-బిల్ నిక్స్

# పరలోకము
# దానిని గురించి నీకేమి తెలియును ?
## (Heaven, what do you know about it ?)

ప్రజలు తరచుగా "పరలోకము"ను గురించి మాట్లాడుతూ ఉంటారు, పాడుతూ ఉంటారు, లౌకికమైన పాటలలో కూడా పాడుతారుగాని బైబిలు పై ఆధారపడి దానిని గురించి చర్చించరు.

విశ్వాస పాత్రుడైన దేవుని బిడ్డకు గల ఇట్టి కోరికతో కూడిన నిరీక్షణను గురించి లేఖనాలలోని కొన్ని సత్యాలు ఏమిటి ?

"పరలోకము" లేక "అకాశములు" అనే పదం బైబిలునందు పలువిధాలుగా వాడబడింది. మొదటిగా భూమికి కొంచెంపైన పక్షులు ఎగురు పరిధి, మంచు బిందువులు, మేఘము, మంచుగడ్డలు, వర్షము ఉండుభాగము (ఆది 27:28, దానియేలు 7:13, యోబు 38:29, ఆది 8:2). రెండవది సూర్య, చంద్ర, నక్షత్రములుండు భాగము (ఆది 1:14-16;22:17). మూడవది ఆకాశము, మహాకాశము అనునది (ద్వితీ యో10:14). ఇదే మూడవ ఆకాశము అనికూడా చెప్పబడును.(2 కొరింథీ 12:2). ఇది దేవుని నివాస స్థలము (కీర్త 33:13, 14 మత్తయి 6:9). చివరిగా మత్తయి 21:25లో పరలోకము స్వయంగా దేవునికే సారూప్యంగా వాడబడింది.

**పరలోకము యొక్క వాగ్దానము :**

యెహోవా నివాస స్థలమయిన పరలోకము విశ్వాసియైన దేవుని బిడ్డకు ఒక పవిత్ర వాగ్దానము. ఉదాహరణకు హింసలలో కూడా దేవునికి విధేయులుగా ఉన్న వారికి పరలోకమందు వారి 'ఫలము అధికమగును' (మత్తయి 5:12) అని తెలియ జేయబడింది. పరలోకమందు ఉంచబడిన రక్షణ అంటూ పౌలు (కొలస్స 1:13) పరలోకము మన నిరీక్షణ అని ప్రకటిస్తున్నాడు. అక్షయమైనది, నిర్మలమైనది, వాడబారనిదినైన స్వాస్థ్యము మనకొరకు పరలోకములో ఉంచబడినది అని (1 పేతురు 1:4) పేతురు వక్కాణిస్తున్నాడు.

వరలోకములో ఎవరు ఉంటారు? లోకస్థులందరూ ఈ దీవెనకరమైన ఇంటిని చివరకు మానవులందరు చూస్తారు అని అంటారుగాని లేఖనాలు ఎక్కడా అట్టి నమ్మకాన్ని కలిగించలేదు. యేసు ప్రభువు స్పష్టంగా చెప్పారు, "ఇరుకు

ద్వారమున ప్రవేశించుడి నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆదారి విశాలమునై యున్నది. దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆదారి సంకుచితమునై యున్నది. దానిని కనుగొను వారు కొందరే" పరలోకము యొక్క ఒక అద్భుతమైన విషయ మేమంటే అక్కడ తండ్రి , కుమార, పరిశుద్ధాత్మ దేవుడు ఉంటారు (ప్రకటన 1:4,5 చూడు). ఇంకా దూతలు పరలోకపు పౌరులు (లూకా 15:7,10 చూడు)ఉంటారు. పరిశుద్ధ గ్రంథములో మనము చదువుచున్న గొప్ప విశ్వాస స్త్రీలు, పురుషులు కూడా అదేవిధంగా పరలోక నివాసులుగా ఉంటారు. "అనేకులు తూర్పు నుండి యు పడమట నుండియు వచ్చి ....... పరలోక రాజ్యమందు కూర్చుందురు (మత్తయి 8:11, హెబ్రీ 11:16) అని యేసు ప్రభువు వాగ్దానం చేసారు.

ఈప్రస్తుతకాలానికి సంబంధించినంతవరకు యేసుక్రీస్తు నందు న్న వారికే పరలోకమును గురించిన నిరీక్షణ కలిగి యున్నది. ప్రభునందు మృతినొందు మృతులు ధన్యులు" ప్రకటన 14:13). క్రీస్తుకు వెలుపట అనగా ఆయన ఆత్మ శరీరమైన సంఘమునకు వెలుపట ఉండుటకు ఇష్టపడువారికి పరలోకమును గురించిన నిరీక్షణ లేదు (గలతీ 3:27 ఎఫెసి 2:12, 13, 5:23). పరలోక నివాసులు "గొఱ్ఱెపిల్ల రక్తములో తమ వస్త్రములను ఉదుకుకొని వాటిని తెలుపు చేసికొనిన వారు" (ప్రకటన 7:14) అని వివరించబడినది. సువార్త యొక్క మొదటి సిద్ధాంతము (అ॥కా 2:38; 22:16) నకు లోబడుట ద్వారా ఆరంభమైన విధానం సత్యమునకు నమ్మకంగా కట్టుబడి ఉండడం ద్వారా కొనసాగుతుంది (1 యోహాను 1:7). విధేయత అనే మార్గాన్ని అనుసరించిన వారికి ఏర్పరచబడిన స్థలము " పరలోకము" (హెబ్రీ5:9).

అదే విధంగా అమాయకత్వంలో మరణించిన వారుకూడా పరలోకములో ప్రవేశించగలరు (మత్తయి 19:14 2 సమేయేలు 12:23). 'బాప్తిస్మము పొందని చిన్న పిల్లలు పరలోకమునుండి తీసివేయబడుదురు' అని కొన్ని మత శాఖలు జెబుతున్న సిద్ధాంతమును గురించి బైబిలులో చెప్పబడలేదు.

**పరలోకము యొక్కతీరు :**

పరలోకం యొక్క తీరును గురించి చాలమంది సరిగా అర్థం చేసికోలేదు. అందువల్లే అక్కడకు వెళ్లాలనే కోరిక వారికి కలుగుటలేదు. కొందరిని ఇలా అడిగితే ....

నీవు మరణించినపుడు ఎక్కడకు

వెళ్లాలని ఆశపడతావు? 1) పరలోకము 2) నరకము 3) వీటిలో ఏదీకాదు- వారు మూడవ అంశము గుర్తిస్తారు. వీరు ఏవిధమునైనగాని ఆత్మీయ, ఆకలి కలిగి లేరు. అందువల్లనే ఈ లోకానికే వేరుగా నిత్యత్వమును గురించిన ఆసక్తి వారికి పూర్తిగా శూన్యం చాలమంది ఈ లోకానికే ముడిపడిపోయారు. అట్టి వారు పరలోకము భూసంబంధమైరదనే భావిస్తారు.

కొందరి ఉద్దేశాలకు విరుద్ధంగా పరలోకము భూమిపై ఉండదు. భూమిపైన ధనము కూర్చుకొనవద్దని, పరలోకమందు కూర్చుకొనమని (మత్తయి 6:19). యేసుక్రీస్తు స్పష్టముగా బోధించారు. అందువల్ల పరలోకము, భూలోకము ఒకటి కాదనేది స్పష్టము. హెబ్రీ పత్రిక రచయిత పితరులు "పరదేశులు యాత్రికులు"నై యున్నారని వారు ఒక శ్రేష్టమైన దేశమును అనగా పరలోక సంబంధమైన దేశమును (హెబ్రీ 11:13-16) కోరుకున్నారని స్పష్టం. ఈ భూమి గతించి పోతుందని మనకు తెలుపబడింది (మత్తయి 24:35; ప్రకటన 21:1). మరియు 2 పేతురు 3:1-13లో ఈ ప్రపంచము ఏవిధంగా గతించిపోనై యున్నదో దానిని గురించి విపులంగా వివరించబడింది.

- వెయిన్ జేక్సన్

**గమనిక ::**

**సత్యవాణి T.V. కార్యక్రమములను**
**ప్రతి బుధ, వారము సాయంత్రం 6:30 గంటలకు**
**రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు**
**ఆరాధన ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం 6:00**
**గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.**

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే
సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను

# సత్యవాక్కు, ఉచిత
# బైబిలు కరస్పాండెన్సు కోర్సు

అనేకులు సత్యవాక్కును మా మిత్రులు దగ్గర లేక బంధువులు యింటిలో చదివాము,చాలా బావుంది.మాకు కూడ ప్రతినెలా పంపండి అని ఉత్తరాలు వ్రాయుచున్నారు.సత్యవాక్కు మీకు ఉచితముగా రాదు.మేము పంపలేము.దానికి సాలు చందా 50రూ॥లు మాత్రమే పంపి మీపేరు నమోదు చేసికొనండి.మీరు చందాకట్టిన ఒక సంవత్సరముపూర్తి కాగానే,ఇంకొక యాభై రూపాయలు పంపి మీ పత్రికను నిరాటంకముగా అందుకొనండి.

బైబిలు కరస్పాండెన్సు మాత్రము ఉచితముగానే పంపించెదము.దాని విషమమైన ఖర్చులలో మీరుమాకు సహాయపడితే సంతోషిస్తాము. బైబిలు కరస్పాండెన్సు కోర్సుల కొరకు పోస్టేజీ రోజుకు రెండు వేల వరకు అవుతున్నది. మాకు చేయూతనిచ్చి ప్రభువు పనిలో సహకరించండి.


Satya Vani

7-9-35, Sambamurty St.,
KAKINADA - 533 004

# మీ కొరకు గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్ విద్యార్థులకు, బోధకులకు,తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.

## Satya Vani

**#7-9-35, Sambamurty Street,**

**Kakinada - 533 004. Ph: 0884- 2363722**

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. VM/KD/02/2009-11**

To

From:

**SATYA VAKKU**

**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004